కంచి పరమాచార్య

శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి

**అమృతవాణి**

**7**

# శంకర విజయం

అనువక్త

దేవరకొండ శేషగిరిరావు

ఎమెస్కో

# శ్రీ కంచి మహాస్వామివారి శంకర విజయం

## ప్రవృత్తి - నివృత్తి

వేదాలు ప్రవృత్తి, నివృత్తియని రెండు మార్గాలు చూపించాయి. ప్రపంచ వ్యవహారాలను ధార్మికంగా నిర్వహించడం ప్రవృత్తిమార్గం. ప్రాపంచిక వ్యవహారానికి దూరంగా ఉండి జనన మరణ ప్రవాహం నుండి విముక్తుడగుట, పరమాత్మతో ఐక్యమగుట నివృత్తిమార్గం.

ప్రవృత్తిమార్గం, వేదచోదిత ధర్మంపై ఆధారపడి వర్ణాశ్రమాలతో ఉండి తన శ్రేయస్సునకు, సంఘ శ్రేయస్సునకు తోడ్పడే రీతితో ఉంటుంది. పుణ్య కర్మ ఫలం క్షీణించగా మరల జన్మనెత్తుట జరుగుతుంది. అంటే స్వర్గ సౌఖ్యము శాశ్వతము కాదని తెలినట్లే గదా! లోకంలో గాని, స్వర్గంలో కాని శాశ్వత సుఖం అంటూ లేదు. ఇక్కడా, అక్కడా భయం, దుఃఖం, క్రోధం మామూలే! కన్ను, చెవులు మొదలైన ఇంద్రియాల వల్ల కొంత సౌఖ్యం అనుభవించే మాట నిజమే. కాని లోనున్న ఆత్మకు ఇవి సంతోషాన్ని ప్రసాదిస్తాయా? ఆత్మతృప్తి కల్గుతుందా?

అఖండానందం అనుభవించాలంటే నివృత్తి మార్గాన్నే అనుసరించాలి. సంఘానికి దూరంగా ఉండి ఆత్మనే చింతిస్తూ అదే బ్రహ్మమని భావిస్తూ సమాధి స్థితిలో ఉండిపోవడమే. లౌకిక సుఖాలననుభవిస్తూ ఒక్కొక్కప్పుడు బ్రహ్మానందం అంటూ ఉంటారు. నిజమైన బ్రహ్మానందం నివృత్తి మార్గంలోనే.ఇట్లా అని నేను చెప్పడం కాదు. వేదమే **'అనావృత్తి శబ్దాత్, అనావృత్తి శబ్దాత్'** అని చెప్పిందని బ్రహ్మసూత్రాలలో ఉంది.శబ్దమనగా ఇక్కడ వేదం. ఇదే ఛాందోగ్యోపనిషత్ మరల మరల చెప్పింది. నివృత్తి మార్గం వల్లనే పరమ సుఖమని, వీటి తాత్పర్యం.

## పెక్కుమందికి పెక్కు మార్గాలు

ఈశ్వరుడాడించే జగన్నాటకంలో మీరందరూ అరణ్యాలకు పొండి సన్యాసాన్ని స్వీకరించండి, ఆత్మ విచారణ చేయండంటే నూటికి 99 మంది వినరు కూడా. అట్టి తీవ్రేచ్ఛ యుండడాన్ని ముముక్షత్వమంటారు. ముముక్షువులే ఈ జ్ఞానమార్గాన్ని అనుసరిస్తారు. ఏ నూటికో, కోటికో ఒక్కనికే పట్టుబడుతుంది. అందరూ ఏదో ఒక పనిలో మునిగి తేలుతూ ఉంటారు. ఇతరుల సాహాయ్యం సాధనాల సాహాయ్యం ఆపేక్షించకుండా ఉండలేరు. వారినే గీతలో కర్మసంగులని అన్నారు. ఎందుకట్లా ఉన్నారంటే వారిలో కోరిక, కర్మ ఉండడం వల్లనే. ఆ కోరిక నెరవేరాలంటే ఊరకే కూర్చుంటే నెరవేరుతుందా? ఆత్మ సాక్షాత్కారానికే ఏ పని చేయకుండా స్తిమితంగా ఉండగలగాలి. మిగిలిన వాటిని సాధించడానికి నిరంతర కార్యమగ్నులు కావలసిందే.

అంటే పనులు చేస్తున్నామంటే లోనున్న ఆత్మను మరిచి దానికి దూరంగా ఉండి బాహ్యమైన వాటిల్లో తగుల్కొంటున్నామన్నమాట. దానిని ప్రవృత్తి యనే పదమే వెల్లడించింది.

ఆత్మవైపు మళ్ళడం, నివృత్తి పదం సూచిస్తుంది. అనగా ప్రవృత్తిలో కార్యమగ్నత, నివృత్తిలో కార్య విముఖత. కనుక కోరికలతో నున్నవారిని ఆత్మవిచారణ చేయండని నిర్బంధించలేం.

కార్యమగ్నులైన వారిని చెడ్డ కోరికలు కోరకుండా ఉండడానికి, మోసాలు చేయకుండా ఉండడానికి, వేదాలు ప్రవృత్తి మార్గంలో ఉన్నవారికి కొన్ని విధుల నేర్పాటు చేసాయి. ధార్మిక మార్గాలను సూచించాయి. ఋషుల మాటల ద్వారా ప్రవృత్తి మార్గాన్ని సక్రమంగా ఉండేటట్లు భగవానుడే చేసాడు.

**యతః ప్రవృత్తిం భూతానాం యేన సర్వమిదం తతం**

అని గీత చెప్పింది. అనగా ఈశ్వరుని నుండే జీవులకు ప్రవృత్తి మార్గం వచ్చిందని చెప్పింది. ఈశ్వరుడే జీవులలో ఉండి వారిని ప్రవృత్తి మార్గంలో పెడుతున్నాడని శంకరులు భాష్యంలో వివరించారు.

జీవులు కర్మ సంగులగుటకు ప్రకృతియే కారణమని అదియే మాయయని అన్నారు. అయితే మాయ, తనంతట అది పనిచేస్తుందా? దీనిని నియమించువాడు, ఈశ్వరుడే. ప్రకృతియే మాయయని, దానిని తన అధీనంలో ఉంచుకొన్నవాడు

ఈశ్వరుడని శ్వేతాశ్వతర ఉపనిషత్తు చెప్పింది. నా మాయను దాటడానికి ఎవ్వరికీ శక్యం కాదని గీతలో **'మమ మాయా దురత్యయా'** అన్నాడు. అందరూ నివృత్తి మార్గంలో ఉండగలరా? ఉంటే ఈ జగన్నాటకం ఎట్లా సాగుతుంది? సనకాదులు, నివృత్తి మార్గంలో ఉండడాన్ని గమనించి బ్రహ్మ, ప్రజాపతులను సృష్టించాడని వారివల్ల ప్రజోత్పత్తి అయిందని భాగవతంలో చదువుకొన్నాం కదా! అందరూ జ్ఞానులైతే ఇక నాటకం ఎట్లా సాగుతుంది?

అయితే నాటకంలో ఇష్టం వచ్చినట్లు నటించవచ్చా? కూడదని, వారికిచ్చిన స్వేచ్ఛ కొద్దిపాటిదని విచ్చలవిడిగా వారుపయోగించకూడదని ఈశ్వరుడు, ఋషుల ద్వారా సందేశమిచ్చాడు. తాత్కాలిక భోగాలననుభవిస్తున్నా వారి మధ్యలో ఒక నియతి, ప్రేమ, అందం, పరస్పర సహకారం ఉండాలని, ధర్మంతో అన్నీ కూడి యుండాలని నిర్దేశించాడు. వేదం ద్వారా ప్రవృత్తి మార్గాన్ని అందించాడు. అందే కర్మానుష్ఠాన పద్ధతి యుంటుంది.

జ్ఞాన కాండాన్ని చివరగా ఉపనిషత్తులందించాయి. సంసారం నుండి విముక్తమైతే మోక్షం. పుణ్యకర్మల నిచ్చేది స్వర్గం.

## కర్మమార్గం ఇచ్చే రెండు ఫలాలు

నిరంతరం కార్యమగ్నులమై ఉంటాం. తాత్కాలిక సుఖం లభిస్తూ ఉంటుంది. అయినా తృప్తి యుండదు. ఏమిటి ఇదంతా అనే తాత్కాలిక వైరాగ్యం కల్గుతూ ఉంటుంది. ప్రసూతి వైరాగ్యం, శ్మశాన వైరాగ్యం, పురాణ వైరాగ్యాన్ని రుచి చూస్తాం తాత్కాలికంగా. నీటిమీద వ్రాత మాదిరిగా అవీ కలకాలం మనల్ని పట్టుకొని యుండవు. మరల కర్మలలో మునుగుతూ ఉంటాం. ధ్యానాదులను చేయలేం. కర్మకాండలు చేస్తూ నివృత్తి మార్గంలో పయనించడానికి అందులో రెండు మార్గాలున్నాయి.

కొందరు ఇహలోక సుఖాలు, పరలోక సుఖాలకై వెంపర్లాడుతూ ఉంటారు. అయితే సక్రమ మార్గంలో అనుభవించండని, మీకిచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేయకుండా ఉండండని, శాస్త్రప్రకారమే కర్మకాండలు చేయండని చెప్పడం ఒకటి. ఇందులో పెక్కు నియమాలుంటాయి.

ఇక మరొక మార్గం ఉంది. కొందరు, మాకీ కర్మలూ వద్దు, ఇహ పర సుఖాలూ వద్దు, అయినా నివృత్తి మార్గం పట్టుబడలేదని వాపోతూ ఉంటారు. అట్టివారికి